సాక్షి వనపర్తి

గురువారం । 31 । ఆగస్టు । 2023



ఆత్మీయ బంధం.. రాఖీ

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీపండుగ నిలుస్తోంది.

వివరాలు 8లో ▸



బతుకమ్మ చీరలొచ్చాయ్..!

మహిళలకు కానుకగా ఇచ్చే బతుకమ్మ చీరలు బుధవారం పాలమూరుకు చేరాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.5 /22.6

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఓటుహక్కు

వనపర్తి: 2023, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించనున్నట్లు అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు వెల్లడించారు. బుధవారం స్థానిక స్కాలర్స్ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఓటుహక్కు పొందటం బాధ్యతగా భావించాలన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంటల నమోదుతో రైతులకు ప్రయోజనం



అమరచింత: రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను వ్యవసాయశాఖ అధికారులకు వివరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ధర్మాపురం, నాగల్‌కడ్మూర్‌లో ఆయన పర్యటించి ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. పంటల నమోదు ఎంతో ఉపయోగపడుతుందని, పండించిన పంటను విక్రయించే సమయంలో వ్యవసాయ అధికారులు ధ్రువీకరించే అవకాశం ఉందని, దీంతో ఎక్కడైనా తమ పంటను అమ్ముకొనే అవకాశం ఉంటుందని వివరించారు. విపత్తుల కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే పరిహారం నమోదుకు సులువుగా ఉంటుందని తెలిపారు. సాగునీరు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారని.. నమోదు చేసుకోవాలని కోరారు. పంటలు తెగుళ్ల బారిన పడకుండా చూసుకోవాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వినయ్, ఏఈఓ హరిత తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ టీచర్లకు కచ్చిత వేతనం ఇవ్వాలి'



కొత్తకోట రూరల్: ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్‌కు కచ్చిత వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ముమ్మళ్లపల్లిలో అంగన్‌వాడీ టీచర్స్‌తో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్ కృషి చేయాలన్నారు. వేతనాలు పెంచడంతో పాటు శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా అన్ని బెనిఫిట్స్ అదించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు, వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాధ, నిర్మల, అనుసూయ, రామేశ్వరి, శోభ, అలివేల, విజయలక్ష్మి, రసూల్‌బీ, సువర్ణ, మమత, ఉష, స్వప్న, ఉదయ్, ప్రమీల, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

కాల్వ మరమ్మతు పూర్తి

గోపాల్‌పేట: మండలంలోని ఏదుల శివారులో నాలుగు రోజుల కిందట డి–5 కాల్వకు గండిపడింది. సర్పంచ్ నాగమణి బుధవారం పరిశీలించి సొంత డబ్బులతో మరమ్మతు చేయించారు. పంటలకు సాగునీటి ఇబ్బందులు తొలగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ మొగిలి ఆంజనేయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గృహలక్ష్మి దక్కేదెవరికో?

కొనసాగుతున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ



గృహలక్ష్మి దరఖాస్తులు దాఖలు చేసేందుకు పోటెత్తిన జనం (ఫైల్)

- మొదటి విడతలో 33,323 అర్జీలు
- జిల్లాకు కేటాయించిన యూనిట్లు 6,910 మాత్రమే..
- క్షేత్రస్థాయి పరిశీలనలో మండల పరిషత్, మున్సిపల్ అధికారులు

వనపర్తి/మదనాపురం: సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు గృహలక్ష్మి పథకం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏళ్లుగా ఊరించి ఎట్టకేలకు ఎన్నికల వేళ పథకాన్ని అమలు చేసిన ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు కేవలం మూడురోజులే గడువు ఇచ్చింది. కలెక్టరేట్‌తో పాటు మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 33,323 దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లాకు మొదటి విడతలో కేవలం 6,910 యూనిట్లు మాత్రమే కేటాయించడం.. అర్జీలు వేల సంఖ్యలో రావటంతో ప్రాధాన్యత క్రమాన్ని ఏ ప్రామాణికంగా తీసుకుంటారనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తు



గోపాల్‌పేట మండలం తాడిపర్తిలో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

చేసుకునేందుకు కేవలం మూడురోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

- మొదటి విడత గృహలక్ష్మి పథకం అర్హులను ఎంపిక చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. గ్రామాలు, పుర వార్డుల్లో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి అర్జీదారుల వివరాలు సేకరించే సర్వే ప్రక్రియ జిల్లావ్యాప్తంగా కొనసాగుతోంది. పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తారా.. లేక తుది నిర్ణయం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిదే కావటంతో ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారికి ఇస్తారా అనే చర్చ సర్వత్రా వినిపిస్తోంది.

జిల్లాలో గృహలక్ష్మి దరఖాస్తులు పురపాలికల వారీగా..		మండలాల వారీగా ..			
పురపాలిక	సంఖ్య	మండలం	సంఖ్య	పెబ్బేరు	2,167
				ఆత్మకూరు	1,910
వనపర్తి	1,461	పానగల్	3,570	మదనాపురం	1,861
అమరచింత	769	చిన్నంబావి	3,213	వీపనగండ్ల	1,721
ఆత్మకూరు	767	కొత్తకోట	2,803	గోపాల్‌పేట	1,366
కొత్తకోట	766	వనపర్తి	2,573	రేవల్లి	1,094
పెబ్బేరు	613	ఖిల్లాఘనపురం	2,533	అమరచింత	949
		పెద్దమందడి	2,238	శ్రీరంగాపూర్	949

నాకు ఇల్లు మంజూరు చేయాలి..



నాకు ఇల్లు లేక గుడిసెలో ఉంటున్నాను. రాత్రిళ్లు విషపు పురుగులు సంచరిస్తుండటంతో భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నాను. ప్రభుత్వ పరంగా మంజూరు చేసి ఆదుకోవాలి.

– బాలమ్మ, కొత్తకోట

అర్హులనే ఎంపికచేయాలి..



ఇల్లు లేని పేదలకే గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలి. రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూడాలి. అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– కృష్ణయాదవ్, గోవిందహళ్లి, మదనాపురం

విచారణ బాధ్యత ఎంపీడీఓలదే

జిల్లాలో గృహలక్ష్మి దరఖాస్తులు వేలసంఖ్యలో వచ్చాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన బాధ్యతను ఎంపీడీఓలకు అప్పగించారు. విచారణ అనంతరం లబ్ధిదారులను ఎలా ఎంపిక చేయాలనే నిబంధనలు రావచ్చు.

– సురేష్, డీపీఓ, వనపర్తి

ఒకవేళ తొలివిడతలో ఎంపిక కాకుంటే మలివిడతలో ఇవే అర్జీలను వెయిటింగ్ జాబితాలో ఉంచి ఇస్తారా.. లేక మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా అనే విషయంపై ప్రభుత్వం నుంచిగాని, అధికారులు గాని ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

అధికారపార్టీ నేతల వద్ద సిఫారస్ వినతులు..

మలివిడత ఎన్నికల తర్వాతే అనే విషయం చర్చకు రావటంతో తొలి విడతలోనే ఎంపిక చేయాలంటూ పలువురు అర్జీదారులు అధికార పార్టీ నాయకులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రికి సిఫారస్ చేయించేందుకు విన్నవించుకుంటున్నట్లు సమాచారం. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇంతవరకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోనూ జోక్యం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గృహలక్ష్మి పథకంలోనూ కలుగ జేసుకొని తమ ఆప్తులు, సన్నిహితులకు తొలి ప్రాధాన్యం ఇచ్చేలా పైరవీలు చేస్తారా.. లేక పారదర్శకంగా సర్వే చేసి అర్హులనే ఎంపిక చేస్తారా అనే విషయం తేలేందుకు వేచిచూడక తప్పదు.

నిరాశ్రయులకు చేయూతనివ్వాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



పెబ్బేరు మండలం కిష్టారెడ్డిపేట పాఠశాలలో బోర్డుపై రాస్తున్న కలెక్టర్

వనపర్తి: ప్రేమ పేరుతో మోసపోయిన యువతులు, పిల్లలు చూసుకోని వృద్ధులకు ఆశ్రయం కల్పించి చేయూతనివ్వాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ, సఖి, సీడబ్ల్యూసీ, మిషన్‌శక్తి విభాగాలతో నిర్వహించిన సమీక్షకు ఆయన హాజరయ్యారు. సఖి కేంద్రంలో ఇప్పటి వరకు నమోదైన కేసులు, రెస్క్యూ చేసి నమోదు చేసిన కేసులు, పరిష్కరించిన వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. ఆపరేషన్ ముస్కాన్‌తో రెస్క్యూ చేసిన చిన్నారులు ఎక్కడున్నారు.. ఏయే పాఠశాలల్లో చదువుతున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. అనాథ పిల్లలుంటే గురుకుల పాఠశాల, కేజీబీవీల్లో చేర్పించాలని సూచించారు. తప్పిపోయిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దర్పన్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని కోరారు.

- అమ్మాయిలపై వేధింపులు జరిగే ప్రదేశాలు గుర్తించాలని, బాలికల వసతి గృహాలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సఖి నిర్వాహకులను ఆదేశించారు. ప్రతి నెల అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం చేసి పంపించాలన్నారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు మిషన్ శక్తి పథకంతో అవకాశాలు అన్వేషించాలని, కేంద్ర నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకొని నివేదిక ఇవ్వాలని మిషన్‌శక్తి కో–ఆర్డినేటర్ భాస్కర్‌ను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి రాంమహేశ్వర్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ కవిత, డీసీపీఓ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి..

పెబ్బేరు రూరల్: ప్రాథమిక స్థాయిలోనే చదువుపై ఆసక్తి పెంపొందించేలా సరళమైన పద్ధతిలో చిన్నారులకు విద్య నేర్పాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. బుధవారం పెబ్బేరు మండలం యాపర్ల, గుమ్మడం తండా, గుమ్మడం, పెంచికలపాడు, జనుంపల్లి, రంగాపూర్, బునాధిపూర్, చెలిమిళ్లలోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మన ఊరు – మన బడి పనులు, గ్రామాల్లో ఓటరు నమోదును పరిశీలించారు. చెలిమిళ్ల కిష్టారెడ్డిపేట పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, యూనిఫాం, పాఠ్యపుస్తకాల పంపిణీ వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో బోర్డుపై అక్షరాలు రాయించి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. తమ గ్రామాన్ని మండల కేంద్రం చేయాలని గుమ్మడం గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పుర కమిషనర్ ఆదిశేషు, తహసీల్దార్ లక్ష్మీ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మండల విద్యాధికారి జయరాములు, డిప్యూటీ తహసీల్దార్ విజయసింహ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌నాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాఖీ

రక్షాబంధన్‌ను పురస్కరించుకొని బుధవారం బాలభవన్ విద్యార్థినులు, నిర్వాహకురాలు లావణ్య, డ్రాయింగ్ టీచర్ నిరీష కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు రాఖీలు కట్టారు. అనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీపండుగను మహిళలు ఘనంగా జరుపుకొంటారని కలెక్టర్ అన్నారు. – వనపర్తి



తిరుపతికెళ్లని పల్లె..
మేడల్లేని ఊరు..



మల్లకల్ గ్రామ ముఖచిత్రం

- జీవితంలో ఒక్కసారైనా తిరుపతికెళ్లి ఏడుకొండల స్వామిని దర్శనం చేసుకుని ఆపదల నుంచి గట్టెక్కాలని ఎవరైనా పరితపిస్తారు.. అయితే ఇక్కడ అంతా రివర్స్.. ఒకరు, ఇద్దరు కాదు.. గ్రామం మొత్తం.. తిరుపతికి వెళ్లరు.

- రెండు, లేదా అంతకంటే ఎక్కువ అంతస్తుల మేడలు ఈ ఆధునిక కాలంలో సహజం. ప్రజలు ఎవరి స్తోమతను బట్టి వారు ఇళ్లు నిర్మించుకుంటారు. ఏ ఊరు చూసినా కనీసం ఒక్కటైనా రెండతస్తుల మేడ దర్శనమిస్తుంది. కానీ.. ఈ గ్రామంలో ఒక్కటంటే ఒక్కటి కూడా కనిపించదు.

..ఇవే కాదు.. ఊరి పేరుతోనే పేర్లు పెట్టడం.. ఆలయ పూజారులుగా బోయలే వ్యవహరించడం వంటివి ఈ గ్రామానికి ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ఇంతకీ ఆ ఊరు ఏది.. ఎక్కడ ఉందని అనుకుంటున్నారా.. ఉమ్మడి పాలమూరులోని జోగుళాంబ గద్వాల జిల్లాకు వెళ్లాల్సిందే మరి.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

నాటి మొదలకల్లు.. నేటి మల్దకల్

ద్వాపరయుగాంతం కలియుగ ఆరంభంలో తిరుమల తిరుపతి దేవుడికి ముందు విష్ణుమూర్తి ఇక్కడ ఆదిశిలపై పాదం పెట్టి ప్రవేశించడంతో దీనికి ఆదిశిల అనే పేరు ఉన్నట్లు బ్రహ్మాండ పురాణంలో నాలుగవ అధ్యాయంలో ఆధారాలున్నాయి. 16వ శతాబ్దంలో గద్వాలను పాలించిన రాజు నలసోమనాద్రి వేటకు వెళ్లగా (ప్రస్తుతం మల్దకల్ అనే గ్రామం అప్పట్లో పెద్ద అడవిగా ఉండేది) మల్దకల్ ప్రాంతంలో ఆయన గుర్రం ముందుకు వెళ్లకుండా ఆగిపోయింది. రాజుకు ఏం జరిగిందో అర్థంకాక అక్కడే పశువులు కాస్తున్న కాపరి(బోయ)ని పిలిచి అడిగాడు. ఆ కాపరి ఇక్కడ దేవుడి విగ్రహం ఉందని విగ్రహాన్ని చూపాడు. తన గుర్రం పరిగెత్తితే గుడి కట్టిస్తానని దేవుడి విగ్రహానికి మొక్కడంతో రాజు గుర్రాన్ని ఎక్కగానే రెట్టించిన వేగంతో తన ప్రయాణాన్ని పూర్తి చేసిందని చరిత్ర చెబుతుంది. దీంతో నలసోమనాద్రి రాజు ఆలయాన్ని కట్టించి, ఆ విగ్రహాన్ని అందులో ప్రతిష్ఠించారు. బోయ కులస్తుడైన ఆ పశువుల కాపరిని ఆ దేవాలయానికి పూజారిగా నియమించారు. ఆ దేవాలయమే నేటి మల్దకల్ దేవాలయం (ఆదిశిలాక్షేత్రం). ఇక్కడ ఏటా డిసెంబర్‌లో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నెలరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. నేటికి ఆ పూజారి కుటుంబస్తులే పూజారులుగా కొనసాగుతున్నారు.

రెండంతస్తులు నిషేధం..

ఇక్కడ ఇంకో ప్రత్యేకత ఉంది. ఈ గ్రామంలో ఆలయ శిఖరం కంటే ఎత్తులో ఎవరు కూడా మేడలు కట్టుకోరు. అలా కడితే ఆ కుటుంబాలకు అరిష్టం జరుగుతుందని నమ్మకం. ఇలా చేసే ప్రయత్నంలో ఓ కుటుంబం మొత్తం ఇబ్బందుల పాలైందనే ప్రచారం గ్రామంలో ఉంది.

ఊరి పేరుతోనే పేర్లు..

ఈ గ్రామానికి మరో విశేషం ఉంది. గ్రామంలో ఎక్కువ మంది పేర్లు ఊరి పేరు మీదనే ఉన్నాయి. ఈ గ్రామంలో జన్మించిన చాలామంది మల్దకల్ పేరును పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మల్దకల్ అనేది దేవుడి పేరు కావడంతో తమకు అంతా మంచే జరగాలని ఆకాంక్షిస్తూ ఇలా గ్రామం పేర్లు పెట్టుకుంటున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

విష్ణుమూర్తి నడియాడిన ప్రాంతం..



మల్దకల్‌లోని ఆదిశిలా క్షేత్రం

రెండో తిరుపతిగా వెలుగొందుతున్న మొదలకల్లు క్షేత్రం గురించి బ్రహ్మాండ పురాణంలో ఆదిశిలా క్షేత్రాన్ని గురించి వివరించారు. మొదలు అనగా ఆది అని, కల్లు అనగా రాయి అని అర్థం. బ్రహ్మదేవుడు ఒక శిలను సృష్టించి ఆదిశిల అని పేరు పెట్టాడని, అక్కడే పరమశివుడు తపస్సు ఆచరించాడని, ఆ శిలపై శ్రీనివాసుడు, లక్ష్మీదేవి, అనంతశయన మూర్తి, వరాహస్వామి, ఆంజనేయుడు ఉద్భవించినట్లు ప్రచారంలో ఉంది. అందుకే తిరుపతి కంటే ముందు విష్ణుమూర్తి తన పాదాలతో నడియాడిన ప్రాంతం కావడంతో ఇక్కడి గ్రామస్తులు తిరుపతికి వెళ్లరని ప్రతీతి. తల వెంట్రుకలు, మొక్కులు అన్నీ ఇక్కడే తీర్చుకుంటారు. ఈ ఆచారాలను ఇతర మతస్తులు పాటించడం మరో విశేషం. ఒకవేళ ఎవరైన వెళ్లాలనే ప్రయత్నిస్తే వారికి అరిష్టం జరుగుతుందని ప్రచారంలో ఉంది.

ఆది శిలాక్షేత్రం..



విష్ణుమూర్తి తిరుపతిలో వెళ్లేముందు తన పాదాలను ఇక్కడే మొదట పెట్టడంతో ఆది శిలక్షేత్రంగా ఏర్పడింది. అందుకే ఈ ప్రాంతానికి మొదలకల్లు అనే పేరు వచ్చింది. కాలక్రమేణ అది కాస్త మల్దకల్ అయింది. ఇక్కడి గ్రామస్తులమంతా తిరుపతికి వెళ్లం. రెండంతస్తుల మేడలు కట్టుకోం.

– ప్రహల్లాద్‌రావు, ఆలయ చైర్మన్

91 ఏళ్లుగా తిరుపతికి వెళ్లలేదు..



నేను పుట్టి బుద్దెరిగినప్పటి నుంచి ఇప్పటివరకు తిరుపతికి వెళ్లలేదు. నా వయసు ఇప్పుడు 91 ఏళ్లు. నేనే కాదు.. మా గ్రామంలో ఎవరూ తిరుపతికి వెళ్లరు. ఎందుకంటే విష్ణుమూర్తి తిరుపతికి కంటే ముందు మా గ్రామంలోనే పాదాలు మోపారనే నమ్మకం. అందుకే మా తండ్రులు, తాతలు కూడా తిరుపతికి వెళ్లలేదు. అదే విషయం మాకు చెప్పారు. నేను నేను మా పిల్లలకు చెప్పాను.

– రాఘవేంద్రరావు, మల్దకల్ గ్రామస్తుడు

తరాలుగా పూజలు చేస్తున్నాం..



మా తాత ముత్తాలకు ముందు నుంచి కూడా ఈ దేవాలయంలో పూజారులుగా దేవుడికి ధూపదీపాలు పెడుతూ పూజలు చేస్తుండేవారు. మేము సైతం అదే ఆచారాన్ని కొనసాగిస్తూ దేవాలయంలో పూజారిగా కొనసాగుతున్నాను.

– రాముడు, ఆలయ పూజారి(బోయ కులస్తుడు)

ఎమ్మెల్యే మర్రికి మతిభ్రమించినట్లుంది

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి

వనపర్తి: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి మతిభ్రమించినట్లుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులను తుపాకీతో కాల్చిచంపుతానని మర్రి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో యువజన కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. తన సొంత నియోజకవర్గమైన వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక నాయకులతో కలిసి ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డికి లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేసి మాట్లాడారు. మర్రి జనార్దన్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా విస్మరించి దౌర్జన్యాలకు దిగటాన్ని ఖండిస్తున్నామన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయాలని, లేని



ఎస్‌ఐకి ఫిర్యాదు అందజేస్తున్న శివసేనారెడ్డి

పక్షంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అధికారం ఉందని బీఆర్‌ఎస్ నాయకులు వీధిరౌడీల్లా ప్రవర్తిస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, యువజన కాంగ్రెస్ కన్వీనర్ నందిమళ్ల చంద్రమౌళి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్, రొయ్యల రమేష్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టవిరుద్ధం

- జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి వై.జానకి

వనపర్తిటౌన్: ర్యాగింగ్ చట్ట విరుద్ధమని.. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి వై.జానకి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సునందిని అధ్యక్షతన జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. విద్యార్థి దశ నుంచే పట్టుదల, ఏకాగ్రత, ప్రణాళికతో ముందుకు సాగితే జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. విద్యార్థులు అవగాహనతో ర్యాగింగ్ భూతాన్ని తరిమి కొట్టేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. బాధ్యతాయుతంగా మెలిగితే నవ సమాజ నిర్మాణం రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యాసంస్థలో స్నేహ, సోదర భావం రోజురోజుకు పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని.. సద్వినియోగం చేసుకునేలా గ్రామీణ ప్రజలను చైతన్యం చేయడంలో విద్యార్థులు కీలక భూమిక పోషించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసాచారి, బాలనాగయ్య, ఉత్తరయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి వై.జానకి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అమడబాకులలో నిర్మిస్తున్న బీసీ కమ్యూనిటీ హాల్, వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకొచ్చారని, ఎన్నికలు సమీపిస్తున్నందున పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

క్లుప్తంగా

కాల్వలో గల్లంతై యువకుడు మృతి

గోపాల్‌పేట: గేదె కాల్వ దాటిపోయిందని, దాన్ని మలుపుకొని వచ్చేందుకు వెళ్లి కాల్వ నీటిలో కొట్టుకుపోయి యువకుడు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అన్నారానికి చెందిన భాస్కర్(26) తల్లిదండ్రులతో పాటు గోపాల్‌పేటకి వలస వచ్చి కొన్ని సంవత్సరాలుగా గోపాల్‌పేటలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆరు నెలల కిందట మండల కేంద్రానికి చెందిన బాల్‌రెడ్డితో జీతం ఉన్నాడు. బుధవారం గేదెలను మేపుతుండగా.. చాకల్‌పల్లి, గోపాల్‌పేట శివారులో గేదె డీ8 కాల్వ దాటి వెళ్లింది. దీంతో చేనులో పడుతుందేమోనని భాస్కర్ కాల్వ దాటేందుకు ప్రయత్నించగా.. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు చూసి వెంటనే కాపాడేందుకు ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది. కొంత దూరం వెళ్లి చూడగా భాస్కర్ శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేసేందుకు వచ్చారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు..


బాలకృష్ణ (ఫైల్)

ఆత్మకూర్: భవన నిర్మాణంలో నిమగ్నమైన కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. మండలంలోని మేడేపల్లికి చెందిన బాలకృష్ణ (22) పట్టణంలో మధ్యాహ్నం కొంత ఇంటి రెండో అంతస్తుపై సెంట్రింగ్ పనుల్లో నిమగ్నమయ్యాడు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు హెచ్‌టీ విద్యుత్ తీగలకు రాడ్ తగిలి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయం కాగా తోటి కార్మికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ తరలించారు. పరిస్థితి మరింతగా విషమించి సాయంత్రం 4 గంటలకు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ బీచుపల్లి తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి..

కల్వకుర్తి టౌన్: అపస్మారక స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ హన్మంత్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన సైదులు(40) ప్రతిరోజూ మద్యం తాగి, ఇంటి వద్ద భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. ప్రతిరోజూ లాగానే మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంట్లోకి వచ్చి భార్యతో గొడవపడి నిద్రించాడు. బుధవారం ఉదయం నిద్రలేపిన లేవకపోవటంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుని భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెరువులో పడి మహిళ..

రాజాపూర్: చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని రంగారెడ్డిగూడలో చోటు చేసుకుంది. రంగారెడ్డిగూడకు చెందిన దేపల్లియాదమ్మ(45) గ్రామ శివారులో ఉన్న గుండ్లపొట్లపల్లి చెరువులో దుస్తులు ఉతికేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయింది. ఆమెతో పాటు చెరువు వద్దకు వచ్చి ఆకాష్, అనిత విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులు తెలియజేశారు. వెంటనే అక్కడి వెళ్లిన సాయిదీప్, రమేష్ యాదమ్మను బయటికి తీశారు. అప్పటికే మృతి చెందినట్లు వారు గమనించారు. మృతురాలి కుమార్తె రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వేధింపు కేసులో భర్తకు జైలు శిక్ష

నారాయణపేట: భార్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న కేసులో భర్తకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం జడ్జి సయ్యద్ జాకియ్య సుల్తానా తీర్పు ఇచ్చారు. కేసు వివరాల్లోకి వెళితే.. మక్తల్ మండలంలోని కర్నెకి చెందిన సావిత్రమ్మ ఆరేళ్ల క్రితం ఆత్మకూర్ మండలం వెన్నచర్లకు చెందిన కుమ్మరి వెంకటేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. అదనపు వరకట్నం కోసం భర్త వేధిస్తున్నాడని 2013 ఏప్రిల్ 2న మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ రమేష్‌రెడ్డి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయగా ఆ తర్వాత ఎస్‌ఐ మురళీగౌడ్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఫిర్యాదులో భర్తకు మొదటి భార్య అనారోగ్య కారణంతో చనిపోయిందని నన్ను రెండో భార్యగా పెళ్లి చేసుకున్నారని తెలిపారు. మొదటి భార్యను వరకట్నం కోసం చంపాడని తర్వాత తెలిసిందని, నా పెళ్లి సమయంలో కొంత కట్నంగా ఇచ్చామని, మళ్లీ అదనపు కట్నం కోసం నా భర్త కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జడ్జీ వాదోపవాదాలు విన్నతర్వాత నేరస్తుడికి ఏడాదిన్నర జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించారు.

ఆత్మీయ బంధం.. రాఖీ

నేడు రక్షాబంధన్



'నీవు నాకు రక్ష.. నేను నీకు రక్షా... అంటూ జరుపుకొనే పండుగ రక్షాబంధన్. ఈ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది. ఎంత దూరానా.. ఎంత బిజీగా ఉన్నా ఏటా పండుగ రోజున అక్కాచెల్లెళ్లు అన్నాదమ్ములకు రాఖీలు కట్టి వారి అనుబంధాన్ని చాటుకుంటారు. సోదరుడి ప్రతి అడుగు విజయం వైపు సాగాలని, ఉన్నత శిఖరాలకు చేరాలని కోరుకుంటూ సోదరి రాఖీ కడుతుంది. దీనికి బదులుగా తన సోదరికి ఏ కష్టం వచ్చినా కాపాడుతానని సోదరుడు వాగ్దానం చేస్తూ కానుకలు అందిస్తారు.'

- మార్కెట్‌లో రంగురంగుల రాఖీలు
- వినూత్న ఆకృతులు.. ఆకట్టుకునే డిజైన్లు
- ఫేస్‌బుక్, వాట్సప్‌లో శుభాకాంక్షలు
- తపాలా, కొరియర్‌లో రాఖీలు పంపుతున్న అక్కా చెల్లెళ్లు

స్టేషన్ మహబూబ్‌నగర్/అచ్చంపేట:

ఒకప్పుడు నూలు దారంతో రాఖీలు తయారు చేస్తుండగా.. ప్రస్తుతం వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయమైన రూపాల్లో లభ్యమవుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఈ పండుగను ఉత్సవంలా ఉత్సాహంగా జరుపుకొంటారు. బ్రహ్మకుమారీ సమాజం, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంటి సంస్థలు వైభవంగా నిర్వహిస్తాయి.

ఆకట్టుకునే ఆకృతుల్లో..

రాఖీల తయారీకి జైపూర్, కోల్‌కత్తా, ముంబై ప్రసిద్ధి. అక్కడి నుంచే ఎక్కువగా దిగుమతి అవుతాయి. గతంలో జైపూర్ మెరుపు రాఖీలు వచ్చేవి. రంగురంగుల మెరుపు కాగితాన్ని వివిధ ఆకారాల్లో చుట్టి వాటికి మెరుపులు అద్ది ఓం, స్వస్తిక్, సూర్యుడు, గణపతి ఆకారాలు కలిగిన బిళ్లలు మధ్యలో అమర్చేవారు. ఇప్పుడు కోల్‌కతా నుంచి వచ్చే రాఖీలు కూడా ఇలాగే సంప్రదాయ రీతిలో తయారు చేస్తున్నారు. పూసలు, కలశం, శంఖు, చక్రాలు, గణపతి ఆకారం, స్వస్తిక్, ఓం తదితర రూపాల్లో రాఖీలను తయారు చేస్తున్నారు. వీటి ధర కాస్త ఎక్కువే. రూ.40 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయని హోల్‌సెల్ వ్యాపారులు చెబుతున్నారు. దూది, దారంతో తయారు చేసిన రాఖీలు చేతికి అందంగా కనిపిస్తాయి. వీటిని ఎక్కువగా ఆర్‌ఎస్‌ఎస్, పలు సంస్థల వారు ఉచితంగా పంపిణీ చేస్తారు. ఇవీ మార్కెట్లో కేవలం రూ.2 నుంచి రూ.5 కే లభిస్తాయి.

చిన్నారుల కోసం..

చిన్నారుల కోసం టీవీల్లో వచ్చే బాల గణేష్, చోటాభీం, బెన్‌టెన్, మిక్కీమౌస్, ఫ్యాషన్ బోటిక్, యాక్ససిరీస్, మోటూపత్లు, ఐస్‌క్రీమ్ కప్, లిటిల్ గణేష్ తదితర రకాల రాఖీలు మార్కెట్లో లభిస్తున్నాయి. డిజైన్లను బట్టి రూ.10 నుంచి రూ.రెండు వేల ధర ఉన్న రాఖీలు అందుబాటులో ఉన్నాయి. వెండి, బంగారు తొడుగులతో రాఖీలు మార్కెట్లో ఉన్నాయి.

చిన్నారుల కోసం..

చిన్నారుల కోసం టీవీల్లో వచ్చే బాల గణేష్, చోటాభీం, బెన్‌టెన్, మిక్కీమౌస్, ఫ్యాషన్ బోటిక్, యాక్ససిరీస్, మోటూపత్లు, ఐస్‌క్రీమ్ కప్, లిటిల్ గణేష్ తదితర రకాల రాఖీలు మార్కెట్లో లభిస్తున్నాయి. డిజైన్లను బట్టి రూ.10 నుంచి రూ.రెండు వేల ధర ఉన్న రాఖీలు అందుబాటులో ఉన్నాయి. వెండి, బంగారు తొడుగులతో రాఖీలు మార్కెట్లో ఉన్నాయి.


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

73 ఏళ్లుగా..


అన్న వెంకటన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు కళావతమ్మ

ఆత్మకూర్: పట్టణానికి చెందిన కడియాల వెంకటన్నకు 90 ఏళ్లు. ఈయనకు ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. రెండో చెల్లెలు పదేళ్ల కిందట చనిపోయింది. ఆత్మకూర్‌లోనే ఉండే చిన్న చెల్లెలు కళావతమ్మ వయసు ప్రస్తుతం 81 ఏళ్లు. ఈమె అన్న వెంకటన్నకు 73 ఏళ్లుగా పండుగరోజు వచ్చి రాఖీ కడుతోంది. అన్నకు రాఖీ కట్టి ఆప్యాయంగా మిఠాయి తినిపిస్తే.. చెల్లికి తనకు తోచిన కానుక ఇచ్చి అన్న సంతోష పెడుతున్నారు. ప్రస్తుతం వీరిద్దరు మనువళ్లు, మనువరాండ్లు, మునిమనువళ్లు, మునిమనువరాండ్లు మొత్తం 52 మందితో హాయిగా కాలం వెళ్లదీస్తున్నారు.

చెప్పలేనంత సంతోషం..



వనపర్తి రామాలయం ప్రాంతంలో ముగ్గురు అన్నయ్యలు ఉన్నారు. రాఖీ పండుగ వచ్చిందంటే మా ఇంట్లో నాదే పైచేయి. అన్నలకు రాఖీలు కట్టేందుకు ఒకరోజు ముందు నుంచే ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తుంటాను. రాఖీలు కట్టడమంటే నాకు అత్యంత ఇష్టం. అనివార్య కారణాలతో నేను వెళ్లలేకపోతే వారే వచ్చి రాఖీలు కట్టించుకుంటారు. – ఉదయశ్రీ, రంగాపూర్

26 ఏళ్లుగా రాఖీలు కడుతున్న కండక్టర్


డిపోలోని ఉద్యోగులకు రాఖీలు కడుతున్న చిట్టెమ్మ(ఫైల్)

జిల్లాకేంద్రానికి చెందిన చిట్టెమ్మ 1997లో మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధుల్లో చేరింది. తనకు ఎంతో ఇష్టమైన రాఖీపండుగను తోటి కండక్టర్లు, డ్రైవర్లతో జరుపుకోవాలనే ఉద్దేశంతో అదే ఏడాది డిపోలో రాఖీలు కట్టడం ప్రారంభించారు. డిపోలోని దాదాపు 200కుపైగా డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి కులమతాలకతీతంగా రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుతోంది. రాఖీపండుగ వచ్చిందంటే డిపోలోని ఉద్యోగులందరూ చిట్టెమ్మ కట్టే రాఖీ కోసం ఎదురుచూస్తుంటారు. అందరినీ ఆప్యాయంగా పలకరించి రాఖీలు కట్టి స్వీట్లు తినిపిస్తుంది చిట్టెమ్మ.

రిటైర్డ్ అయ్యే వరకు రాఖీలు కడుతాను..

ప్రతి ఏడాది రాఖీ పండుగ రోజు ఆర్టీసీ ఉద్యోగులందరికీ రాఖీలు కడుతాను. రాఖీ రోజు ఎంత బిజీగా ఉన్నా డిపోలోని ఉద్యోగులందరికీ రాఖీలు కడుతాను. అందరికీ రాఖీలు కడుతుంటే ఎంతో ఆనందరం కలుగుతుంది, నేను రిటైర్డ్ అయ్యే వరకు రాఖీలు కడుతాను. – చిట్టెమ్మ, కండక్టర్, మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో


అచ్చంపేటలో కొనుగోలు చేస్తున్న రాఖీలు

నూలు పుట్టిన రోజు..

రాఖీ పండుగను అచ్చంపేటలో పద్మశాలీలు వినూత్నంగా జరుపుకొంటారు. రక్షాబంధన్‌ను నూలు పుట్టిన పండుగగా నిర్వహించుకుంటారు. ఈ రోజు నూలు పుట్టిందని.. నూలుతో తయారు చేసిన కంకణం చేతికి కట్టుకుంటే సకల శుభాలు కలుగుతాయని వీరి నమ్మకం. మార్కెట్లో ఎన్ని రకాల రాఖీలు వచ్చినా.. వీరు మాత్రం పత్తితో తయారు చేసిన నూలు కంకణాలనే చేతికి కట్టుకుంటారు. ఇది 400 ఏళ్ల నుంచి వస్తున్న పండుగని.. పురాణాల్లో నూలు గురించి ఉందని చెబుతున్నారు.

గాయత్రి మాలధారణ..

పత్తితో తయారు చేసిన కంకణం ధరించడమే కాకుండా గాయత్రి మాల కూడా ధరిస్తారు. ముందుగా గాయత్రి హోమం నిర్వహించి అనంతరం నూలుతో తయారు చేసిన గాయత్రిమాలను సామూహికంగా ధరిస్తారు. ఈ కార్యక్రమం ఏళ్లుగా కొనసాగుతుందని.. కరోనా కారణంగా గతేడాది నిర్వహించలేకపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది భక్తమార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 41వ నూలు పూర్ణిమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.


అచ్చంపేట భక్త మార్కండేయ ఆలయంలో గాయత్రిమాల ధరిస్తున్న పద్మశాలీలు (ఫైల్)

అనాధిగా వస్తోంది..



పద్మశాలీలు రాఖీ పౌర్ణమిని నూలు పుట్టిన పండుగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పండుగ రోజున నిష్టగా ఉండి నూలుతో తయారు చేసిన కంకణం, గాయత్రి మాధ ధరిస్తారు. ఇవి సంప్రదాయంతో పాటు శుభానికి సూచకంగా భావిస్తాం. ఈ సాంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తాం. – కోట కిశోర్, జిల్లా అధ్యక్షుడు, పద్మశాలి యువజన సంఘం

సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు

కేటీదొడ్డి: వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని ఉమిత్యాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించి తమ నిరసన తెలిపారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం కోతలు విధించడం తమకు కంటతడి పెట్టిస్తుందన్నారు. ఇప్పటికే వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోతుంటే ఇష్టమెచ్చినట్లుగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమిత్యాల, ఉమిత్యాలతండా, కేటీదొడ్డి రైతులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ వద్ద రైతులు

అప్ప చెల్లిస్తామని నమ్మించి హత్య

- వృద్ధురాలి హత్య కేసులో నిందితుల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ మహేశ్వర్‌రావు

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన సుందరమ్మ(68) హత్య కేసులో తమిళనాడుకు చెందిన మరియామాల్, ధర్మరాజు, కోట్టై స్వామి, భూమికను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి సీఐ మహేశ్వరావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి సుందరమ్మ ఈనెల 23వ తేదీన అదృశ్యమైన ఘటనపై పాన్‌గల్ స్టేషన్‌లో భర్త బాలకిష్టారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 24వ తేదీన కేసు నమోదైంది. దర్యాప్తు చేస్తున్న క్రమంలో 28న వనపర్తి జిల్లా కేంద్రం సమీపంలోని రాజనగరం బావిలో మహిళ మృతదేహం లభ్యంకాగా, సుందరమ్మగా గుర్తించారు. అనుమానితులపై ఆరా తీయగా మృతురాలి ఇంటి సమీపంలో సొంగల వ్యాపారం చేసుకునే తమిళనాడుకు చెందిన కుటుంబాన్ని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం బయటపడిందన్నారు. సుందరమ్మ దగ్గర అప్పుగా తీసుకున్న రూ.60వేలతో పాటు ఆమె మెడలో ఉన్న నగలను కాజేయాలనే ఈనెల 23వ తేదీన ఉదయం అప్పు డబ్బులు అడగడానికి ఇంటికి వచ్చిన సుందరమ్మను అనుకున్న ప్రకారం గొంతు నులిమి చంపి బంగారు నగలను కాజేసి మృతదేహాన్ని వాహనంలో తీసుకెళ్లి రాజనగరం బావిలో పడేశారు. ఐదుగురిపై కేసు నమోదు చేయగా, విజయరామరాజు మినహా నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పరారీలో ఉన్న విజయరామరాజు కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

లక్కీ లాటరీ పేరుతో టోకరా


అచ్చంపేట రూరల్: రోజుకో కొత్త ఎత్తుగడతో ప్రజల సొమ్మును సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారు. పట్టణంలో లక్కీ లాటరీ పేరుతో ఓ మహిళను బురిడీ కొట్టించారు. ఉప్పునుంతల మండలం వెల్టూరు పంచాయతీ సమీపంలోని మూన్యతండాకు చెందిన మూడావత్ చంద్రకళ కొన్ని రోజుల నుంచి పట్టణంలోని సాయినగర్ కాలనీలో నివాసం ఉంటుంది. ఈనెల 21న ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. రూ.25లక్షలు లక్కీ లాటరీ ద్వారా మీ మొబైల్ నంబర్ ఎంపికైందని చెప్పాడు. నమ్మిన ఆమె అతను చెప్పినట్లుగానే రూ.1.50లక్షలు అతనికి ఆన్‌లైన్‌లో చెల్లించింది. 9రోజులైనా ఇంకా డబ్బులు అకౌంట్‌కు రాలేదని గ్రహించి మోసపోయానని బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జిలాని తెలిపారు.

పాలమూరులో అరుదైన పాము


అరుదైన జాతి కోలుబ్రిడే కుటుంబానికి చెందిన పాము ఇదే..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు సమీపంలోని అక్షర కాలనీలో నివాసం ఉంటున్న మాధవి ఇంట్లోకి మంగళవారం అర్ధరాత్రి అరుదైన పాము వచ్చింది. ఆందోళనకు గురైన ఆమె వెంటనే జడ్చర్ల లోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర సహాయ ఆచార్యుడు డా.బి.సదాశివయ్యకు సమాచారమిచ్చారు. హుటాహుటిన ఆయన అక్కడికి చేరుకుని ఈ పామును పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది విషరహిత సర్పమని, ఎలాంటి హాని చేయబోదన్నారు. ముఖ్యంగా బల్లులను ఆహారంగా తీసుకుంటుందన్నారు. ఈ పామును శాస్త్రీయంగా లైకోడాన్ ఫ్లావికల్లిస్ అంటారని, ఇది అరుదైన జాతి కోలుబ్రిడే కుటుంబానికి చెందిందని పేర్కొన్నారు. దీని మెడపై పసుపు రంగు పెద్ద మచ్చ ఉన్నందున ఎల్లోకాలర్డ్ వూల్ఫ్ స్నేక్ అని పిలుస్తారన్నారు. 2016లో వనపర్తి, హైదరాబాద్ జిల్లాలలో కనిపించిందన్నారు. దీనిని మొదట 2007లో తమిళనాడులో గుర్తించారని, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనూ గుర్తించారని సుమారు 50 సెం.మీ. వరకు పెరుగుతుందన్నారు.

వెల్లూరు బ్రైడల్ స్నేక్ లభ్యం


అరుదైన బ్రైడల్ స్నేక్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మాజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాల సమీపంలో బుధవారం అరుదైన పామును గుర్తించారు. నల్లటిరంగు కలిగి తెల్లటి పట్టీలతో కూడిన వెల్లూరు బ్రైడల్ పామును చూసిన స్థానికులు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా.సదాశివయ్యకు సమాచారం అందించారు. ఆయన బయోలజీ ఉపాధ్యాయుడు దేవిలాల్‌కు చెప్పడంతో వెళ్లి పామును పట్టుకుని ఫొటోలను సదాశివయ్యకు పంపించారు. పట్టుకున్న పాము అరుదైనదిగా గుర్తించారు. విషరహిత పాము కావటం వల్ల దానివల్ల మనుషులకు ఎలాంటి ప్రమాదం లేదని సమీపంలోని అటవీప్రాంతంలో వదిలేయాలని సూచించటంతో దేవిలాల్ దానిని గుట్టపై ఉన్న అటవీప్రాంతంలో వదిలేశారు. సదాశివయ్య మాట్లాడుతూ నల్లటిరంగులో తెల్లటి పట్టీలు కలిగి అందంగా కనిపించే పామును శాస్త్రీయంగా డ్రయోకలామస్ నింఫా అని పిలువబడే కోలుబ్రీడే కుటుంబానికి చెందినదిగా వివరించారు. 50సెం.మీ. వరకు పాము పొడవు అవుతుందన్నారు. ఈ పామును మొట్టమొదట తమిళనాడులోని వెల్లూరు సమీపంలో 1803లో గుర్తించారని తెలిపారు. దీనిమెడపైన ఉన్న తెల్లని మచ్చ పెళ్లికూతురు మెడమీద ఉన్న ఓణిలా ఉండటం మూలాన వెల్లూర్ బ్రైడల్ స్నేక్ అని పిలుస్తారన్నారు. కేరళ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో దీనిని గుర్తించినా ఇప్పటి వరకు పాముకు సంబంధించిన అనేక విషయాలు ప్రపంచానికి తెలియవన్నారు. ఎన్ని గుడ్లు పెడుతుంది, ఎన్ని రోజులకు పిల్లలుగా మారుతాయి, ప్రత్యుత్పత్తి వివరాలు తెలియవన్నారు. ఎలాంటి గోడలైనా సునాయాసంగా ఎక్కగలదని, ఎలుకలు, బల్లులు ప్రధాన ఆహారంగా తీసుకుంటుందన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

బాలానగర్: మండల కేంద్రం సమీపంలోని పెద్దాయపల్లి పరిధిలోని దుందుబీనది తీరాన వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో హుండీని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు. అందులో సుమారు రూ.40 వేల వరకు నగదు ఉంటుందని ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.అయితే ఆలయంలో నాలుగు నెలల క్రితం సైతం ఇలాగే దొంగతనానికి పాల్పడినా.. పోలీసులు దొంగలను గుర్తించలేకపోయారు.

క్లుప్తంగా...


బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న భూమన, ఈవో ధర్మారెడ్డి తదితరులు

18 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం తిరుమల ఆలయం ఎదుట ఆవిష్కరించారు. అనంతరం భూమన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. సెప్టెంబర్ 18న ధ్వజారోహణం సందర్భంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు సంతృప్తికరంగా వాహన సేవలతో పాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు స్వీకరించబోమన్నారు. సెప్టెంబరు 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం నిర్వహిస్తామని తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా బుధవారం ఆరుగురు శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా, వై.సీతారామిరెడ్డి, బాలసుబ్రమణియన్ పళనిస్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం యానాదయ్య, సిద్ధా వీరవెంకట సుధీర్ కుమార్ బోర్డు సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరితో శ్రీవారి ఆలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు.

4 నుంచి వ్యవసాయంపై జీ-20 వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: 'వాతావరణ పరిస్థితులను తట్టుకునే వ్యవసాయం'పై సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జీ-20 టెక్నికల్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఐకార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వర్క్‌షాప్‌ను శంషాబాద్ సమీపంలోని నోవాటెల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

పొత్తులు లేకుండా పోరాడే ధైర్యముందా?

చంద్రబాబుకు సజ్జల సవాల్
- ప్రధాని మోదీని తిట్టిన నోటితోనే పొగడ్తలా?
- కాళ్లు పట్టుకోగలిగే నేర్పు చంద్రబాబుకే సొంతం
- ప్రభుత్వ వ్యతిరేక ఓటే లేదు.. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు పొత్తులు లేకుండా పోటీ చేయాలనే ఆలోచన చేసే ధైర్యం కూడా లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం నడ్డాతో వంగివంగి నంగినంగిగా మాట్లాడారని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు దూషించిన నోటితోనే ఇప్పుడు పొగుడుతున్నారని గుర్తు చేశారు. ఎవరినైనా సరే తిట్టిన గంటలోనే కాళ్లు పట్టుకోగలిగే నేర్పు ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సజ్జల బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్యాకేజీ చాలని.. సన్మానాలు నిర్వహించి
టీడీపీపై పూర్తిగా నమ్మకం కోల్పోయిన కార్యకర్తలను కాపాడుకోవడానికే చంద్రబాబు పొత్తుల కోసం పాకులాడుతున్నారు. పవన్ కల్యాణ్‌తో కలసి పోటీ చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో పొత్తుల కోసం తహతహలాడుతున్నారు. కమీషన్ల దాహంతో పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడం కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు 2016లో కేంద్రానికి తాకట్టు పెట్టారు. హోదా కంటే ప్యాకేజీతోనే అధికంగా ప్రయోజనం చేకూరుతుందని చంద్రబాబు సంబరాలు చేసుకున్నారు. నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కూడా సన్మానించారు. ప్రత్యేక హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకొచ్చామని, అంతకు మించి బీజేపీతో విభేదాలు లేవంటూ ఇప్పుడు పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారు.

బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ..
ఏపీలో 175 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే లేని టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటూ చంద్రబాబు జోకులు వేస్తున్నారు. ఆయన వ్యవహార శైలి బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ. జనసేన, బీజేపీతో పొత్తు ఉండదని బాబు ప్రకటిస్తే లోకేశ్ పాదయాత్రకు వస్తున్న అరకొర కార్యకర్తలు కూడా మొహం చాటేయడం ఖాయం.

వ్యతిరేక ఓటు ఉంటే కదా ఏకం చేయడానికి?
ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ గత 50 నెలలుగా అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, తిరుపతి లోక్‌సభ.. బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు స్థాయి విజయాలు సాధించడమే అందుకు నిదర్శనం. వైఎస్సార్‌సీపీకి 70 శాతం మంది ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యతిరేకంగా ఉన్నాయని ప్రతిపక్షాలు భావిస్తున్న 30 శాతం ఓట్లు ఏకమైనా ఒరిగేదేముంది? 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయభేరి మోగించడం ఖాయం. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు.

ఎన్టీఆర్ ఆత్మకూ వెన్నుపోటు..
ఎన్టీఆర్ అగ్నిసాక్షిగా లక్ష్మీ పార్వతిని వివాహం చేసుకున్నారని, 1994 ఎన్నికల్లో వారిద్దరూ కలిసి ప్రచారం చేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని, తద్వారా వారి వివాహాన్ని ప్రజలు హర్షించారని సజ్జల గుర్తు చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని, టీడీపీని హస్తగతం చేసుకున్న చంద్రబాబుకు ఇప్పటికీ సొంత గుర్తింపు లేదన్నారు. అవసరమైనప్పుడల్లా ఎన్టీఆర్ బొమ్మను వాడుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమానికి ఆయన భార్య లక్ష్మీపార్వతిని ఆహ్వానించకుండా ఎన్టీఆర్ ఆత్మకు మరోసారి వెన్నుపోటు పొడిచి క్షోభ పెట్టారని మండిపడ్డారు. బీజేపీలోకి చంద్రబాబు పంపిన ఏజెంట్లతోపాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌లా పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

రాష్ట్ర రక్షణకు మేధావులు బీజేపీలోకి రావాలి..

▶ మొదటి పేజీ తరువాయి
కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రోజువారీ ఖర్చుల కోసం కూడా.. భూముల వేలం ద్వారా డబ్బు సమకూర్చుకుంటోన్న దుస్థితి నెలకొందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక అవసరాల కోసం ఓఆర్ఆర్ రింగ్ రోడ్డును తాకట్టు పెట్టడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం తెలంగాణలోని విద్యావంతులు, మేధావులు బీజేపీలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని ఆయన పిలుపునిచ్చారు.

ఏ బాధ్యతనిచ్చినా స్వీకరిస్తాం
బీజేపీ అగ్రనేతలు వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్‌జోషి వంటి పెద్దల ప్రభావం తనపై ఉందని పార్టీలో చేరిన డాక్టర్ వికాస్ తెలిపారు. తాను, తన భార్య డా.దీప ప్రజలకు మరింత సేవ చేసేందుకు బీజేపీలో చేరామని, రాబోయే రోజుల్లో అప్పగించే బాధ్యతలను మనస్ఫూర్తిగా నిర్వర్తిస్తామన్నారు.
– డాక్టర్ వికాస్

ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ గెలుపు తథ్యం
తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుపు తథ్యమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనపట్ల ప్రజలు పూర్తిగా విసిగిపోయారనీ, రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనమన్నారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో రామరాజ్యం రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. డా.వికాస్, దీపల చేరికతో రాజన్న సిరిసిల్లలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు.
– బండి సంజయ్

విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి
దేశంలో మోదీ ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితులై, ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో డాక్టర్ వికాస్, దీప దంపతులు బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని విద్యావంతులు ముఖ్యంగా యువత రాజకీయ రంగంలోకి రావాలని విలువలతో కూడిన రాజకీయాలు, జవాబుదారీతనంతో కూడిన రాజకీయాలు వారితోనే సాధ్యమన్నారు.
– డా. కె. లక్ష్మణ్

ఉత్తర తెలంగాణలో బీజేపీ బలోపేతం
వేములవాడ ప్రాంతంలో సామాజిక, సేవా కార్యక్రమాలను చేపడుతున్న డాక్టర్ దీప, వికాస్ దంపతుల చేరికతో ఉత్తర తెలంగాణ ప్రాంతంలో బీజేపీ మరింత బలోపేతమవుతుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు.
– ఎంపీ అర్వింద్

సోలాపూర్‌లో మార్కండేయ రథయాత్ర

మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ హాజరు


సోలాపూర్‌లో స్థానిక నేతలతో హరీశ్, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని సోలాపూర్‌లో అత్యంత వైభవంగా జరిగిన మార్కండేయ రథోత్సవంలో రాష్ట్ర మంత్రులు టి.హరీశ్‌రావు, మహమూద్ అలీ పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఇద్దరు మంత్రులతో పాటు మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బుధవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో సోలాపూర్‌కు వెళ్లారు. స్థానిక పద్మశాలీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన మార్కండేయ రథోత్సవంలో బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులతో కలిసి మంత్రులు పాల్గొన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతి రాఖీ పౌర్ణమి సందర్భంగా రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీ. కాగా ఈ రథోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రులకు స్థానిక మహిళలు, బీఆర్ఎస్ నేతలు స్వాగతం పలికి రాఖీలు కట్టారు. మార్కండేయ ఆలయ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆలయ నిర్వాహకులకు మంత్రి హరీశ్‌రావు రూ.కోటి విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

సోలాపూర్ బహిరంగ సభాస్థలి పరిశీలన
సోలాపూర్‌లో త్వరలో జరిగే బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొంటారు. సభ నిర్వహణ కోసం అనువైన స్థలాన్ని మంత్రి హరీశ్‌రావు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. బాల్‌కోటి మైదానం, ఈద్గా మైదానాలను పరిశీలించిన నేతలు కేసీఆర్‌తో చర్చించిన తర్వాత వేదికను ఖరారు చేస్తామని వెల్లడించారు.

చవితి తర్వాతే బీజేపీ బస్సుయాత్రలు

సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి తర్వాతే బస్సు యాత్రలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పండుగ ముగియగానే భద్రాచలం శ్రీరాములవారి ఆలయం, బాసరలోని శ్రీసరస్వతీ దేవాలయం, ఆలంపూర్ శ్రీజోగుళాంబ గుడి నుంచి రథయాత్రలు(బస్సుయాత్ర)ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మూడు ప్రాంతాల నుంచి 18 రోజులపాటు 60–70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ యాత్రలు నిర్వహించాలని భావిస్తున్నారు. సెప్టెంబర్ 7 తర్వాత రథయాత్రలు మొదలుపెట్టి 17న హైదరాబాద్ స్టేట్ విమోచన వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రధాని మోదీ పాల్గొనేలా భారీ బహిరంగసభ నిర్వహించాలని తొలుత భావించారు. అయితే వినాయక చవితి, ఇతర కారణాల వల్ల సెప్టెంబర్ 20 తర్వాత ఈ యాత్రలు చేపడితే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. బస్సు యాత్రల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో బహిరంగసభ ద్వారా ఏర్పాటు చేసే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


మంత్రి పట్నం మహేందర్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కమిషనర్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జాయింట్ డైరెక్టర్ జగన్, ఈఈ వెంకటేష్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సమాచార, ప్రజా సంబంధాలు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తనకు కేటాయించిన చాంబర్‌లో మహేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సచివాలయంలోని మొదటి అంతస్తులో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సమాచార శాఖ కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, కృష్ణారావు, బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న సీతాదయాకర్‌రెడ్డి

- కుమారులతో కలిసి రేవంత్‌రెడ్డితో మాటామంతి



దేవరకద్ర: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి బుధవారం తన కుమారులతో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి గతంలో సీతాదయాకర్‌రెడ్డితో కలిసి టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఏ పార్టీలో చేరాలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని మక్తల్, దేవరకద్ర నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించి వెల్లడించారు. అయితే ఇటీవల దయాకర్‌రెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబం తేరుకోలేని స్థితిలో ఉండటంతో ఏ పార్టీలో చేరాలో నిర్ణయించలేదు. మూడు రోజుల కిందట పర్కాపురంలో నిర్వహించిన రెండు నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆమె ప్రకటించారు. ముహూర్తం ఎప్పుడు అనేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు. బుధవారం హైదరబాద్‌లో ఆమె కుమారులు సిద్ధార్థరెడ్డి, కార్తిక్‌రెడ్డి, మేనల్లుడు జగదబీరెడ్డిలతో కలిసి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిశారు. కాంగ్రెస్ పార్టీలో కలిసేందుకు చర్చలు జరిపినట్లు తెలుస్తుంది. దేవరకద్ర, మక్తల్ రాజకీయాలు మరో మలుపు తిరగనున్నాయి.

బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో కలిపేద్దాం



కొల్లాపూర్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధం కావాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అడ్డగోలు సంపాదనతో ముఖ్యమంత్రి కేసీఆర్ దిగుజారుడు రాజకీయాలు చేస్తున్నారని, రూ.లక్షలు, కోట్లు వెచ్చించి ఇతర పార్టీల నాయకులను కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే వ్యవహారం నియోజకవర్గంలో కొనసాగుతుందన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి ఇతర పార్టీలోకి అమ్ముడుపోయిన నేతలను గ్రామాల్లోకి రానివ్వకుండా తరిమికొట్టాలన్నారు. విద్యార్థులు, యువకుల ఆత్మార్పణంతో తెలంగాణ ఏర్పడిందన్నారు. అమరుల త్యాగాలను అడ్డుపెట్టుకొని సీఎం కేసీఆర్ రాజ్యాధికారం అనుభవిస్తున్నారన్నారు. తిరగబడదాం–తరిమికొడదాం నినాదంతో అమ్ముడు పోయిన నాయకులను గ్రామాలకు రానివ్వమన్నారు. హన్మంతునాయక్, వెంకటస్వామి, రహీంపాష, నయూమ్, పసుపుల నర్సింహ తదితరులున్నారు.

ముందుగానే బతుకమ్మ చీరలు

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో అందజేత
- ప్రస్తుతం మొదటి విడతగా జిల్లా మహిళా సమాఖ్యకు చేరుకున్న 25,000
- పంపిణీ లక్ష్యం 3.09 లక్షలు


చీరలు దించుకుంటున్న ఐకేపీ అధికారులు


జిల్లాకు వచ్చిన చీరలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దసర పండుగకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుంది. బతుకమ్మ పండుగ అక్టోబర్ 15 నుంచి ప్రారంభం కానుంది. మహిళలకు బతుకమ్మ కానుకగా ఇచ్చే చీరలు బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా సమాఖ్యకు చేరుకున్నాయి. మహిళా సంఘాల ఆధ్వర్యంలో వీటిని ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. అధునాతన డిజైన్లతో కూడిన చీరలు ఈసారి ఆడబిడ్డల మనుస్సును దోచుకోనున్నాయని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. మొదటి విడతగా కేవలం 25 వేలు మాత్రమే వచ్చాయి. సందడి వాతావరణంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్నారు. తెలంగాణ ఆడపడుచులకు ప్రతి శుభకార్యానికి చీర పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సంప్రదాయానికి అనుగుణంగా బతుకమ్మ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు ఉన్న కుటుంబాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తుంది. బంగారు, వెండి జరి అంచు చీరలు, చెక్స్ డిజైన్లు ఈసారి ప్రత్యేకంగా రూపొందించారు. జిల్లాలో మొత్తం 3 లక్షల 9 వేల చీరలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో తొలి విడతగా ప్రస్తుతం 25 వేలు మాత్రమే వచ్చాయి. మిగిలిన చీరలు వచ్చే నెల చివరి వరకు రానున్నాయి. ఏపీడీ శారద, ఐబీ డీపీఎం నాగమల్లిక పర్యవేక్షణలో చీరలు అన్‌లోడ్ చేశారు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది..



జిల్లాకు తొలి విడతగా 25 వేల బతుకమ్మ చీరలు వచ్చాయి. గతేడాది జిల్లాకు 3 లక్షల 9 వేల చీరలు పంపిణీ చేశాం. ఈ ఏడాది లక్ష్యం ఇంకా నిర్దేశించలేదు. త్వరలోనే జిల్లాకు లక్ష్యాన్ని నిర్ణయిస్తాం. మిగిలిన చీరలు త్వరలోనే వస్తాయి. – యాదయ్య, డీఆర్‌డీఓ

ఎమ్మెల్యే గన్ స్వాధీనం చేసుకోండి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: పాదయాత్ర పేరుతో గ్రామాల్లో తిరుగుతూ.. ఓట్లు వేయకపోతే కాల్చిపడేస్తా అంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గన్ స్వాధీనం చేసుకోవడంతోపాటు కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం తెచ్చుకున్నది నీళ్లు, నిధులు, నియామకాల కోసమే అని అన్నారు. వందలాది మంది అమరుల ఆకాంక్షలకు విరుద్ధంగా రాష్ట్రం సిద్ధించినప్పటి నుంచి బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయంగా సాగుతుందన్నారు. కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు. పదేళ్లుగా విద్యార్థులపై ఎంతో దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న సీఎం కేసీఆర్ తన వైఖరిని మార్చుకుని మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. చేసేది గోరంత, చెప్పేది కొండంత అన్నట్లు ఎమ్మెల్యే మర్రి తనకు తానుగా నాగర్‌కర్నూల్ సీఈవోగా బిరుదును ప్రదానం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిరుదులు ఇవ్వాల్సింది ప్రజలని, తనకు తానే ప్రకటించుకున్న ఎమ్మెల్యేకు మెదడు మోకాళ్లలో ఉందని విమర్శించారు. పాదయాత్రలలో ప్రజలకు ఏం చేసినావో, ఏం చేస్తావో చెప్పాలే కానీ, నీ అంతు చూస్తా అనే మాటలు మాట్లాడకూడదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీతో పెట్టుకున్నోడు చరిత్రలో లేకుండా పోయారని, మర్రి జనార్దన్ రెడ్డికి అదే గతి పడుతుందన్నారు. సమావేశంలో అర్థం రవి, బాలగౌడ్, పాండు, నాగం శశిధర్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ పర్యటనకు కేంద్ర మంత్రి రాక

కొల్లాపూర్: కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ త్వరలోనే నియోజకవర్గంలో పర్యటనకు విచ్చేస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలపై చర్చించేందుకు బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. 167కే జాతీయ రహదారి, కృష్ణానదిపై ఐకానిక్ వంతెన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు ఏప్రిల్ 8వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అయితే పనుల పరిశీలనతో పాటు, బైపాస్ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసేందుకు కేంద్ర మంత్రి త్వరలోనే విచ్చేస్తారని ఆయన వివరించారు. పర్యటన అంశాలను రాష్ట్ర పార్టీ నిర్ణయిస్తుందని తెలిపారు.


కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న సుధాకర్‌రావు

అవినీతి, అక్రమాలపై చర్చకు సిద్ధం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి, టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి సవాల్


మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి తదితరులు

జడ్చర్ల: నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలపై దేవుడి ఎదుట ప్రమాణాలు చేసేందుకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముందుకు రావాలని టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో భూ, ఇసుక, మట్టి మాఫియాలు కొనసాగుతున్నాయని వాటితో ఎమ్మెల్యేకు సంబంధాలు ఉన్నాయన్నారు. వంద పడకల ఆస్పత్రి కాంట్రాక్టర్ ఎమ్మెల్యేకు రూ.2 కోట్లు వెచ్చించి ఇల్లు నిర్మించి ఇచ్చారని, రూ.100 కోట్ల అవినీతి సొమ్ముతో హైదరాబాద్‌లో ఇల్లు నిర్మించారన్నారు. గత ఎన్నికల సమయంలో తనకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.2కోట్లు ఇచ్చినట్లు తన అనుచరులతో ఆరోపణలు చేయించారని, దీనిపై ఇద్దరం దేవుడిపై ప్రమాణం చేద్దామని సవాల్ విసిరారు. ఈ వ్యవహారంపై నిజాలు నిగ్గు తేలాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రూ.కోట్లు ఎలా ఇవ్వగలిగారో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి తేల్చాలన్నారు. సింగిల్‌విండో ఎన్నికల సమయంలో తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే తన ఇంటికి వచ్చి మద్దతు కోరారని, రూపాయి తీసుకోకుండా బేషరుతుగా బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలలో సిల్వర్ కాయిన్‌లు పంపిణీ చేసింది బీఆర్ఎస్ నాయకులేనన్నారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తాను ప్రజాహిత పాదయాత్ర చేస్తుండగా నసరుల్లాబాద్‌లో యాత్రపై ఎమ్మెల్యే ఉసిగొలిపి దాడి చేయించారని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గాయపడిన తమ వారు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకపోగా తమపైనే తిరిగి కేసులు నమోదు చేస్తామని భయపెడుతున్నారని అన్నారు.

గడప గడపకు పాదయాత్ర..
నియోజకవర్గంలో గడప గడపకు పాదయాత్ర ద్వారా వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటానని అనిరుధ్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, కరెంట్, డబుల్ బెడ్రూం ఇళ్లు తదితర అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన స్థానిక కమిషనర్ బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాదయాత్ర ముగింపు రోజున నేతాజీ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తామని, సభకు టీపీసీసీ ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌తో కలిసి పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. పార్టీ టికెట్ ఎవరికి వచ్చినా గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. టికెట్ కేటాయింపు అధిష్టానం నిర్ణయిస్తుందని, ప్రస్తుతానికి ఎవరికి ఖరారు కాలేదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నిత్యానందం, నర్సింహులు, యాదయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 123 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 975 క్యూసెక్కులు, కుడి కాల్వకు 714 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 80 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,227 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.492 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.


గుడ్డెందొడ్డి వద్ద కొనసాగుతున్న నీటి పంపింగ్

1,020అడుగుల నీటిమట్టం
మదనాపురం: మండలంలోని రామన్‌పాడ్ జలాశయంలో బుధవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. రామన్‌పాడు ఎన్టీఆర్ కాల్వ ద్వారా వెయ్యి, వ్యవసాయ అవసరాల కోసం కుడి, ఎడమ కాల్వ ద్వారా 65 క్యూసెక్కులు, భీమాఫేజ్–2 ద్వారా 815 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. తాగునీటి అవసరాలకోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 853.4 అడుగులు
దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 853.4 అడుగుల వద్ద, 87.8605 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 3,750, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,855, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 6.548 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 12,728 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.